ప్రజాశక్తి
మంగళవారం 20 ఫిబ్రవరి 2024 5
శ్రీ సత్యసాయి

మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

ప్రచారవేడి..!

◆ పెరుగుతున్న నేతల తాకిడి
◆ వచ్చే వారంలో కాంగ్రెస్, టిడిపి యాత్రలు

ఎన్నికల షెడ్యుల్ వెలువడక ముందే ప్రచార వేడి పెరుగుతోంది. అనంతపురం జిల్లా కేంద్రంగా ప్రధాన పార్టీలన్నీ రాజకీయ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఇప్పటికే వైసిపి సిద్ధం సభను రాయలసీమ స్థాయి సమావేశాన్ని అనంతపురం జిల్లా రాప్తాడు కేంద్రంలో నిర్వహించారు. రెండు వారాల క్రితం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఉరవకొండలో పర్యటించారు. మరో పది రోజుల్లో చంద్రబాబు మరోసారి జిల్లా పర్యటనకు వస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో కాంగ్రెస్ పార్టీ కూడా అనంతపురం జిల్లా నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించబోతున్నట్లు ప్రకటించింది. ఇలా పార్టీలు ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ప్రచార వేడిని పుట్టిస్తున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికార వైసిపి రెండు రోజుల క్రితం సిద్ధం పేరుతో రాప్తాడులో భారీ బహిరంగ సభను నిర్వహించింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్న ఈ సభకు రాయలసీమ జిల్లాల నుంచి పెద్దఎత్తున జనసమీకరణ చేపట్టారు. ఒక విధంగా సక్సెస్ అయిందని వైసిపి శ్రేణులు సంబరపడుతున్నాయి. ఈ సభ ద్వారా తమ సత్తాని చాటుతామని చెప్పారు. ఇకపోతే తాజాగా టిడిపి కూడా ప్రచారానికి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లు వచ్చే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈనెల 26 తరువాత జిల్లాలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు టిడిపి సిద్ధం అవుతోంది. అంతలోపు టిడిపి, బిజెపి, జనసేన పొత్తుల వ్యవహారం కూడా తేలే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక అభ్యర్థులను దాదాపు ఖరారు చేసే అవకాశాలున్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే కదలిరా కార్యక్రమాన్ని ఉరవకొండలో టిడిపి నిర్వహించింది. ఆ కార్యక్రమంలో చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఆ సభకు కూడా మంచి స్పందనే వచ్చిందని టిడిపి నాయకులు భావిస్తున్నారు. రాబోయే సభలను కూడా ఇదే విధంగా విజయవంతం చేస్తామని చెబుతున్నారు. ఇక కాంగ్రెస్ కూడా ఇక్కడి నుంచే రాష్ట్ర ఎన్నికల ప్రచారాన్ని ప్రాంభించనున్నట్టు ప్రకటించింది. దీనికి జాతీయ కాంగ్రెసు అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పిసిసి అధ్యక్షురాలు షర్మిల ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. జాతీయ స్థాయి నాయకులు హాజరవుతుండటంతో కాంగ్రెస్ కూడా తన బలాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమవుతోంది. సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి కూడా ఇప్పటికే కసరత్తు ప్రారంభించడమే కాకుండా మడకశిరలో తనకు పట్టున్న నియోజక వర్గం కావడంతో వచ్చే ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలన్న పట్టుదలతో ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా ఆయన సమావేశాలు నిర్వహించే పనిలో నున్నారు. నియోజకవర్గాల వారీగా ప్రభావం చూపే వారిని గుర్తించి బరిలో దింపేందుకు సిద్ధమ వుతోంది. మూడు ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని ఇక్కడి నుంచే మొదలుపెడుతుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కు తోంది. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రెండూ ప్రచారంలో పోటీపడుతున్నాయి. అభ్యర్థులు కూడా పూర్తి స్థాయిలో ఖరారైపోతే ప్రచారాలు మరింత తారా స్థాయికి చేరే అవకాశాలున్నాయి. ఇప్పటికీ అభ్యర్థులు అనుమానమున్న చోట పార్టీ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఖరారైన చోట మాత్రం నేతలు రోజుకొక చోటకు పర్యటనలు జరుపుతున్నారు. సాధ్యామైనంత వరకు ఇంటింటికెళ్లి ప్రజలను కలుసుకునే పనిలోను న్నారు. ఏది ఏమైనా మండు వేసవి ప్రారంభంతోనే ప్రచార వేడి ఊపందుకోవడం గమనార్హం. కాగా జనసేన సందడి మాత్రం జిల్లాలో అంతగా కన్పించడం లేదు. పవన్‌కళ్యాణ్ ఇప్పటి వరకు ఇటువంటి ఎన్నికల ప్రచారాల్లోకి రాలేదు. తక్కిన మూడు ప్రధాన పార్టీల నుంచి మాత్రం నేతల తాకిడి పెరిగింది. రాబోయే రోజుల్లో ఇవి మరింత తారా స్థాయికి చేరే అవకాశాలు కన్పిస్తున్నాయి.

సార్వత్రిక సమరానికి 11 వేల మంది సిబ్బంది

◆ ప్రతి ఓటరూ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలి
◆ కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

త్వరలో జరగబోయే సార్వత్రిక సమరానికి 11 వేల మంది సిబ్బంది నియమించి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలో స్వీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చాలామంది తమ ఓట్లు పోయాయని తాము కొత్తగా ఓటు దరఖాస్తు చేసుకున్నాం వస్తాయా.. రావా..? ఎవరికి ఓటు వేసినా ఈవీఎం లోపాలతో వేరొకరికి ఓటు పడుతుందన్న అపోహలు వీడాలన్నారు. ప్రతి ఒక్క ఓటరు కలెక్టరేట్లోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సందర్శించవచ్చన్నారు. ప్రజలు వారికి వీలైన సమయంలో వస్తే వారికి ఈవీఎంల మీద ఉన్న అపోహలు తొలగిపోతాయన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పూర్తి అవగాహనతో పోలింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలియజేశారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 1561 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహనఖు సుమారు 11 వేల మంది సిబ్బంది అవసరమని గుర్తించామన్నారు. ఆయా నియోజకవర్గంలో ప్రధాన కేంద్రాల్లో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. గోరంట్లలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను మౌంటశ్వరి హై స్కూల్ నందు స్థల సేకరణ గుర్తించామన్నారు. ఇందులో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. లేపాక్షిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మరొక కౌంటింగ్ కేంద్రానికి స్థలాన్ని పరిశీలన చేశామన్నారు. అక్కడ పెనుగొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గం సంబంధించిన కౌంటింగ్ జరుగుతుందన్నారు. ధర్మవరం మార్కెట్ యార్డ్‌లో ఈవీఎంలను భద్రపరుస్తామన్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో పిఓ, ఏపీవో, ముగ్గురు ఓపివోలు ఉంటారని తెలిపారు. 20 శాతం పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, స్వీప్ అధికారి శివరంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్ పాలనలో గ్రామ స్వరాజ్యం సాకారం

'వాలంటీర్లకు వందనం'లో మంత్రి ఉషశ్రీ చరణ్

వాలంటీర్‌ను సత్కరిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-పెనుకొండ

సిఎం జగన్ రాష్ట్రంలో వాలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యంను సాకారం చేశారని రాష్ట్ర మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజకవర్గ పరిధిలోని ఉత్తమ వాలంటీర్లను సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ అనునిత్యం ప్రజలకు మేలు చేసే ప్రక్రియలో సిఎం జగన్ వాలంటీర్లను భాగస్వాములను చేశారన్నారు. బిసిలను బెటర్ క్యాస్ట్‌గా, ఎస్సీ, ఎస్టీలను గుండెల్లో పెట్టుకొంటూ, మైనారిటీలకు అగ్రపీటం వేస్తున్నారన్నారు. సిద్ధం సభ దేశ చరిత్రలోనే నభూతో నభవిష్యత్ అన్నారు. ఎపిలో కాంగ్రెస్, రాజ్యసభలో టిడిపి ఖాళీ అయ్యాయని, వచ్చే ఎన్నికల్లో అన్ని సభల్లో టిడిపి ఖాళీ అవుతుందన్నారు. కుర్చీ మడత పెట్టడాని కి మీ కుర్చీ ఎక్కడుందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను ప్రశ్నించా రు. సిఎం జగన్ చొక్కా స్లీవ్ మడత పెడితే ప్రతిపక్షాల దుకాణం బంద్ అవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలను కైవసం చేసుకొనే ప్రక్రియలో వాలంటీర్లు క్రియాశీలకంగా పని చేసి జగన్ మీపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. మీరందరూ కసిగా పని చేయండి, పెనుకొండలో 50 వేల మెజారిటీ సాధిద్దాం అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

ఫొటోజర్నలిస్టుపై దాడి అమానుషం

నిందితులను శిక్షించాలి
సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరా

ప్రజాశక్తి-మడకశిర

అనంతపురం జిల్లా రాప్తాడులో వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన సిఎం జగన్ సిద్ధం సభలో ఫొటోజర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరా రెడ్డి డిమాండ్ చేశారు. రఘువీరా సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జగన్ సభకు వచ్చిన వారు దాడి చేయడానికి తీవ్రంగా ఖండిం చారు. నెల జీతం కోసం పని చేసే వారిపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. అతడి చికిత్సకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించా లన్నారు. ఆయనతో పాటు డిసిసి అధ్యక్షుడు సుధాకర్, మండల కన్వీనర్ మంజునాథ్ ఉన్నారు.

గడువులోగా పరిష్కరించకపోతే సమ్మె తీవ్రతరం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఇంతియాజ్

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ కమిషనర్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేస్తారన్నా గౌరవంతో సమ్మెను రెండు రోజుల పాటు వాయిదా వేశామని, అప్పటిలోగా పరిష్కరించక పోతే మెరుపు సమ్మెకు సిద్ధం అవుతామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఇంతియాజ్ తెలియజేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంపై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి సిఐటియు, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపి రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కమిషనర్ ఇచ్చిన హామీతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ 26 నుంచి జనవరి 10వ తేదీ వరకు సమ్మె చేశామన్నారు. ఆ సమయంలో అప్పటి కమిషనర్ ప్రమోద్ కుమార్, డిఎస్‌పి కంజాక్షన్ వన్‌టౌన్ స్టేషన్‌లో చర్చలు జరిపారన్నారు. ఆ సమయంలో కరోనా విపత్కర సమయంలో రోజు వారీ వేతనం కింద అదనంగా తీసుకున్న పారిశుధ్య కార్మికులకు రూ.400 నుంచి 650 ఇవ్వాలని డిమాండ్ చేస్తే రూ.560 ఇస్తామని, పట్టణ విస్తీర్ణం, పెరిగిన జనాభాకు అనుగుణంగా తీసుకున్న మరో 15 మంది కార్మికులను రోజు వారి కార్మికులుగా తీసుకుంటామనే వాటిపై హామీ ఇచ్చారన్నారు. ఈ హామీలను అమలు చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. అధికారులు కోరిన మేరకు రెండు రోజులు గడువు ఇచ్చామని, ఆలోగా పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి జగదీష్, కోశాధికారి ఆనంద్, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

'సిద్ధం' సభ చరిత్రలో నిలిచిపోతుంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

అనంతపురం జిల్లా రాప్తాడులో వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన సిఎం జగన్ సిద్ధం సభ చరిత్ర లో నిలిచిపోయిందని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిద్ధం సభను చూసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియాకు నిద్ర పట్టిండదు అని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేనపార్టీల తరపున పోటీ చేసేందుకు కూడా జంకుతారని తెలిపారు. మరోమారు ప్రజలు వైసిపిని ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయనతో పాటు సింగిల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, అమరాపురం జడ్పిటిసి మూర్తిసారక్క, జయరాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎస్ఎన్ కృష్ణమూర్తి, అక్రం, అన్సర్‌ఖాన్, మంజునాథ్, ప్రసాద్ ఉన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరులో నిర్లక్ష్యం తగదు

తహశీల్దార్ బాలనరసింహకు వినతి పత్రం ఇస్తున్న వ్య.కా.సం. నాయకులు

ప్రజాశక్తి- లేపాక్షి

నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన నిరుపేదలు సోమవారం ఇంటి స్థలాల కోసం తహశీల్దార్ బాలనరసింహకు వినతి పత్రం అందజేశారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దరఖాస్తుల కాలపరిమితి ముగిసినా అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే విచారణ జరిపి అర్హులైన పేదలకు వారంలోపు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, లేనిచో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసింహప్ప, ప్రేమవతి, రాము, గంగమ్మ తదిత రులు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

మీడియాతో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ

వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేందు కు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎవరిది అభివృద్ధి పాలన.. ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు తెలుసన్నారు. బూటకపు ప్రసంగాలు మాని దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. సిఎం జగన్ సిద్ధం పేరుతో సభలు పెట్టి బూటకపు ప్రసంగాలు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్క ఛాన్సే జగన్‌కు రాజకీయంగా చివరి ఛాన్స్ అన్నారు. ఓటమి భయంతో బదిలీలు అంటూ 77 మందిని జగన్ మడతపెట్టాడని, మిగిలిన వాళ్లను ఎన్నికల్లో జనం మడత పెడతారన్నారు. రూ. 10 ఇచ్చి రూ. 100 దోచిన జగన్ సంక్షేమం గురించి మాట్లాడడం శోచనీయమన్నారు. సామాజిక న్యాయం, పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. సిద్ధం సభ ఫెయిల్యూర్ కావడంతోనే ఫ్రస్టేషన్‌లో జగన్ రౌడీ గ్యాంగ్ ఫొటోగ్రాఫర్‌పై దాడులు చేశారని మండిపడ్డారు. టిడిపి తెచ్చిన 120 సంక్షేమ పథకాలను జగన్ రద్దు చేశారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించాడన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రివర్స్ చేసి, రైతుల సబ్సిడీలు నిలిపివేసిన జగన్‌కు రాయలసీమలో సభ పెట్టే అర్హతే లేదన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రవిశంకర్, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి మునిమడుగు చిన్న వెంకటరాముడు, బెల్లాల చెరువు చంద్ర, వేణు, జయరాం, గాయత్రి పాల్గొన్నారు.

రఘువీరాపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

ప్రజాశక్తి-మడకశిర

సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరా రెడ్డిని విమర్శించే స్థాయి దాల్ మిల్లు రవిశేఖర్ రెడ్డికి లేదని, ఎవరి మెప్పు కోసమో గతం మర్చిపోయి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబో మని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. పట్టణంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. నాయకులు జాన్, శ్రీని వాస్‌రెడ్డి, తిమ్మప్ప, కోడిపల్లి మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన ఒక్క కాంగ్రెస్ పార్టీ వల్లే జరగలేదని, ఆనాడు సిపిఎం మినహా అన్ని పార్టీలు మద్దతు ఇవ్వడంతోనే జరిగిందన్న విషయం తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి మంత్రి రఘువీరా భిక్షతో ఆయిల్ ఫెడరేషన్‌లో ఉద్యోగం పొందిన విషయం గుర్తు లేదా అన్నారు. వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తుంది ఒక్క రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగాధమప్ప, నర్సేగౌడ్, క్రిష్టప్ప పాల్గొన్నారు.

మోరుబాగల్‌లో పిహెచ్‌సి ప్రారంభం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మోరుబాగల్ గ్రామానికి మంజూరైన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. సర్పంచి తిప్పేస్వామి మాట్లాడు తూ వైద్యం చేయించుకోవడానికి గ్రామంలో పిహెచ్‌సి లేక మడకశిర, గుడిబండ, కర్నాటకలోని శిర, తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. తమ ఇబ్బందులను గుర్తించి గ్రామంలో పిహెచ్‌సి ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా రోగులకు సేవలు అందించడానికి ప్రయివేటు భవనంలో ప్రారంభించామని, కొత్త భవనం మంజూరైన తర్వాత అందులోకి మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి తిప్పేస్వామి, డాక్టర్లు సౌందర్య, భారతి, వెంగళరావు, ఎంపిటిసి రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోరుబాగల్‌లో పిహెచ్‌సిని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

వైసిపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రసాద్

అమరాపురం : వైసిపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన పేలుబండ ప్రసాద్‌ను సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఈరన్న ఆధ్వర్యంలో ముఖ్యఅతిథి జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి ఘన సన్మానించారు. ప్రసాద్ మాట్లాడుతూ నన్ను నమ్మి పదవి ఇచ్చినందుకు తన వంతు బాధ్యతగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అత్యున్నత ప్రాధాన్యత కల్పించిన ఏకైక పార్టీ వైసిపి అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, ఎంపిటిసి జయరాం, నాయకులు జెకె.నరసింహమూర్తి, పాతన్న, శివకుమార్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

25న బంజారాల సింహగర్జన

పెనుకొండ : ఈ నెల 25వ తేదీ కదిరి పట్టణంలో నిర్వహిస్తున్న 'బంజారాల సింహగర్జన'ను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద సోమవారం వారు 'బంజారాల సింహగర్జన' గోడపత్రికను విడుదల చేశారు. మాట్లాడుతూ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ చక్రేనాయక్, జిల్లా అధ్యక్షులు అంజేనాయక్, మండల ప్రెసిడెంట్ శ్యాంనా యక్, జనరల్ సెక్రటరీ గంగాధర్‌నాయక్, వర్కింగ్ ప్రెసి డెంట్ సాయిరామ్‌నాయక్, యువత ప్రెసిడెంట్ బాలునాయక్, కౌన్సిలర్ భాస్కర్‌నాయక్, కార్యదర్శులు, మెంబర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

తాగునీటి సమస్య పరిష్కారం

అమరాపురం : మండలంలోని కెంపక్కనహట్టి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సంబంధిత అధికారులు, సర్పంచి తిప్పేస్వామి ఆ గ్రామంలో ఉన్న బోరుకు కొత్త మోటార్, స్టార్టర్‌ను బిగించి ప్రజలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి

ప్రజాశక్తి-మడకశిర

ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేయాలని రొళ్ల మండల ఎంఇఒ ఎస్.మోహన్ సూచించారు. రొళ్ల మండలంలోని బిజి హళ్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఇఒ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ స్థాయి శిక్షణకు మండలంలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. రత్నగిరి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.హరిప్రసాద్ 'ఆనందలహరి బోధన పద్ధతిలో నో కాస్ట్ లో కాస్ట్ బోధనోపకరణాలు, ఆట పాటలతో ప్రత్యక్ష పద్ధతిలో కృత్యాధార పద్ధతిలో శిక్షణ ఇచ్చారు. కథలను నాటకీకరణ పద్ధతిలో బోధించవచ్చో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు రవి, సుజాత, రత్నమ్మ, బిజి హళ్లి హైస్కూల్ హెచ్‌ఎం కె.ఎంజారప్ప పాల్గొన్నారు.

గడువులోపు పంట నమోదు, ఈకెవైసి పూర్తిచేయాలి

ప్రజాశక్తి-రొద్దం

గడువులోపు పంట నమోదు, ఈకెవైసి చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఆవు టాల రమణారెడ్డి ఆదేశించారు. స్థానిక ఎఒ కార్యాలయంలో సోమవారం ఆయన రైతు భరోసా కేంద్రం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీ పంట నమోదు, రైతుల ఈకెవైసి ప్రక్రియను గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఆర్‌బికెలో ఎరువుల వినియోగం, డ్రిప్ అందిం చడం, మద్దతు ధరకు పంటల కొనుగోలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ శంకరనాయక్, ఎఇఒలు అంజాద్, హంసవేణి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

మడకశిర : ఛత్రపతి శివాజీ మహారాజు జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని బాలాజీ నగర్ టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మనోహర్, మండల అధ్యక్షులు లక్ష్మి నారాయణ, కృష్ణమూర్తి, భక్తర్, బేగార్లపల్లి రవికుమార్, కౌన్సిలర్ ఉమేష్, తిమ్మరాజు, శ్రీనివాస్, వైజాగ్ రమేష్, శంకర్ పాల్గొన్నారు.



పోలింగ్‌కేంద్రాల పరిశీలన

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం తూమకుంట తదితర ప్రాంతాలలో ఉన్నా పోలింగ్‌కేంద్రాలను ఎన్నికల సెక్ట్రోల్ ఆఫీసర్ నటరాజ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓట్ల నమోదు, మాక్ పోల్, పోలింగ్ కేంద్రాలలో ఉన్నా సౌకర్యాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, బూత్ లెవెల్ ఆఫీసర్ రవి తేజ, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు సన్మానం

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వాలంటీర్లను సన్మానించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనపర్చిన వాలంటీర్లకు ఎంపీపీ జగన్మోహన్ చేతుల మీదుగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామానాయక్, ఇఒఆర్‌డి సునీత, సీనియర్ అసిస్టెంట్ అమీర్‌బాషా, మాజీ జెడ్పిటిసి భాస్కర్ రెడ్డి, సర్పంచి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీల దుకాణం ప్రారంభం

కదిరి టౌన్ : పట్టణంలోని అరిఫ్ బైపాస్ రోడ్ లో సిరి భవ్య చిన్నపిల్లల హాస్పిటల్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఎస్‌బిఆర్ అమరన్ బ్యాటరీల దుకాణాన్ని వైసీపీ బీసీ విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ బత్తల ఆదినారాయణ, రామ్ ప్రసాద్, మురళి, జంపాల నాగేంద్ర, కాంట్రాక్టర్ బాబా, కుటాగుళ్ళ సలీం, చికెన్ జకీర్, చలపతి తదితరుల పాల్గొన్నారు.

న్యాయవాదికి సన్మానం

హిందూపురం : స్థానిక సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి రాష్ట్ర వైఎస్ఆర్‌సిపి న్యాయ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప ఆధ్వర్యంలో వైసిపి న్యాయ విభాగం న్యాయవాదులు రామచంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన పరిధికి వచ్చిన న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిపి ఇందాద్, ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు నాగరాజు రెడ్డి, ప్రసాద్ రెడ్డి, సుదర్శన్, తిమ్మారెడ్డి, కృష్ణమూర్తి, శివశంకర్, ఆంజనేయులు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు రాష్ట్ర కమిటీ ఏర్పాటు

పుట్టపర్తి రూరల్ : ఎస్‌టియు రాష్ట్ర కమిటీ ఎంపిక పట్ల శ్రీ సత్య సాయి జిల్లా ఎస్ టి యు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 77వ ఎస్‌టియు కౌన్సిల్ సమావేశం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సత్యసాయి జిల్లాకు చెందిన జి రామ మోహన్‌ను ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శిగా, ఆర్థిక కమిటీ మెంబర్‌గా డి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్ రెడ్డి ,చంద్రశేఖర్ వారిని అభినందించారు.

వైసిపి పతనం ప్రారంభం : టిడిపి

బుక్కపట్నం : టిడిపి నిర్వహిస్తున్న రా కదలిరా సభలతో వైసిపి ప్రభుత్వం పతనం ప్రారంభమైందని తెలుగుదేశం పార్టీ సత్య సాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వ పాలనలో యువత నిరుద్యోగులుగా మారిపోయారని అన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రా కదలిరా సభల ద్వారా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైసిపి ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండ కడుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దిదింపేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్‌బాషా, రామానాయుడు, ఈశ్వరయ్య, శ్రీరాములు,చెన్నప్ప,నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ కష్టాలు

బత్తలపల్లి : రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు తరలివచ్చిన వాహనాలు తిరుగు ప్రయాణంలో అన్ని ఒక్కసారిగా ముందుకు కదలడంతో ట్రాఫిక్ కష్టాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. రాప్తాడులో సభ ముగిసిన తరువాత చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి వచ్చిన వాహనాలు బత్తలపల్లి మీదుగా వెళ్లాయి. సభ వద్ద నుంచి బత్తలపల్లి వరకు 26 కిలోమీటర్లు వాహనాలు రోడ్డు కిరువైపులా భారీగా నిలిచాయి. దీంతో వాహనాలను పంపించేందుకు పోలీసులు అష్టకష్టాలు పడ్డారు. సభ నుంచి బత్తలపల్లికి చేరుకునేందుకు బత్తలపల్లి వాసులకు రాత్రి 12 గంటలు అయింది. ధర్మవరం రూరల్, ముదిగుబ్బ, శింగనమల సిఐలు ఆరోహణరావు, యతీంద్ర, శ్రీధర్, నలుగురు ఎస్‌ఐలు, నలుగురు ఎఎస్‌ఐలు, దాదాపు 20 మంది పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రక్తదాన శిబిరం

కదిరి టౌన్ : కదిరి రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో స్పేస్ జూనియర్ కళాశాలలో మానస ధార సేవా సంస్థ వ్యవస్థాపకులు, హరీష్ స్కూల్స్ అడ్వైజర్ ఎంఎస్. ప్రశాంత్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారిని డాక్టర్ శ్రీవాణి, వైద్య సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఎంఎస్. ప్రశాంత్ మాట్లాడుతూ తమ తల్లి పద్మా శ్రీనివాస్ జయంతి సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ కదిరి వారి సహకారంతో, స్పేస్ పూర్వ విద్యార్థుల సౌజన్యంతో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యార్థులు విద్యతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని క్రీడల వల్ల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం బీడుపల్లి సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్యుస్టూషన్స్ నిర్వాహకులు నిర్వహిస్తున్న క్రీడా సాంస్కృతిక యువజన ఉత్సవ కార్యక్రమానికి ఎస్పీ మాధవ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత నిత్యజీవితంలో చదువుతో పాటు, క్రీడలకు కూడా ప్రాధాన్యతనివ్వాలని క్రీడలతో మానసిక ప్రశాంతతో పాటు చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తు, క్రీడా స్ఫూర్తిని నింపుతున్నారన్నారు. క్రీడలలో గెలుపోటములు సాధారణమని రెండింటిని సమానం తీసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడాకారులతో ఎస్పీ కొద్దిసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఇందులో రాయలసీమ జిల్లాలైన కర్నూల్, తిరుపతి, కడప, చిత్తూరు, అనంతపురం నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్యుస్టూషన్ డైరెక్టర్ అశోక్ కుమార్, డీన్ బాల కోటేశ్వరి, పుట్టపర్తి సిఐ కొండారెడ్డి, సంస్కృతి కాలేజీ ఆధ్యాపకులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిపించని 'స్పందన'

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి అధికారుల్లో కనీస స్థాయి స్పందన కనిపించడం లేదు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి మండల వ్యాప్తంగా 17 శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొని ప్రజలు ఫిర్యాదు చేసిన సమస్యలపై స్పందించాల్సిన అవసరం ఉంది. అయితే సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి కొద్దిమంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. తహశీల్దార్ శివప్రసాద్ రెడ్డితో పాటు ఎంపీడీవో, గ్రామీణ నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్, డిఎఆర్‌డిఎ ఎపిఎం, ఐసిడిఎస్, గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ మినహాయించి ఇతర ఏ శాఖ అధికారులు పాల్గొనలేదు. గతంలో కూడా పూర్తిస్థాయిలో ఏ అధికారి కూడా స్పందన కార్యక్రమానికి హాజరు కావడం లేదు. ప్రతిరోజు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ సచివాలయ కార్యదర్శులు స్పందన కార్యక్రమంపై కనీసం స్పందించడం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకొని స్పందన పై స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హాజరుకాని అధికారులకు మెమోలు : స్పందన కార్యక్రమానికి హాజరు కాని అధికారులకు శాఖ పరంగా మెమోలు జారీ తహశీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సరైన వివరణ ఇవ్వకపోతే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

స్పందనకు హాజరైన కొద్దిమంది అధికారులు

కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

29లోపు భవన నిర్మాణాలు పూర్తి కావాలి

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ప్రాధాన్యత భవననిర్మాణాలు ఈనెల 29 లోపు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు ప్రజా ప్రతినిధులతో చేయించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జగనన్నకు చెబుతాం స్పందన కార్యక్రమం నిర్వహించారు.కలెక్టర్ తో పాటు డిఆర్ఒ కొండయ్య, నరసయ్య, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డిపిఒ విజయ్ కుమార్, ఆర్డీవో భాగ్యరేఖ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈనెల 29న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు ప్రారంభించాలన్నారు. 188 భవనాలు పూర్తి అయ్యాయని వాటిని ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవం చేయించాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయడానికి జిల్లా మండల స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులు చొరవ చూపి లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. మార్చి నెల 18 తేదీ నుంచి పదో తరగతి పరీక్షల నిర్వహించడం జరుగుతుందని అధికారులు అందరూ సమన్వయంతో పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ యం టీ నాయక్, డిసిఒ కృష్ణ నాయక్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్,భూమి సర్వే రికార్డుల ఏడీ రామకృష్ణ, సాంఘిక సంక్షేమ అధికారి శివం గురుప్రసాద్, వ్యవసాయ అధికారి సుబ్బారావు, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి సంబంధిత పాల్గొన్నారు.

టిడిపి నేతలపై బెదిరింపులను మానుకోండి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్

సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

తమ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తి లేదని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు. వైసిపికి చెందిన చేనేత వర్గానికి చెందిన కొందరు నాయకులు పరిటాల శ్రీరామ్ సమక్షంలో సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక మారుతీరాఘవేంద్రస్వామ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పరిటాలశ్రీరామ్ సమక్షంలో పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూధర్మవరంలో చేనేతలు రాజకీయాలకు దూరంగా ఉంటారని, కొందరు నాయకులు వారికి ఇష్టం వచ్చిన పార్టీలో ఉంటూ మద్దతు తెలుపుతారని అన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక చేనేతలను రాజకీయంగా ఇబ్బందులు పెడుతోందని విమర్శించారు. వ్యాపారాలను రాజకీయాలను ఒకటిగానే చూస్తూ ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. కొందరు ఆపార్టీని వీడి టిడిపిలో చేరుతుంటే వైసిపి నాయకులు వారిని బెదిరిస్తున్నారని ఆరోపించారు. మాట్లాడితే జేసీబీలు పెట్టి కూల్చివేస్తామంటూ బెదిరిస్తున్నారని వారు జేసీబీలు పెడితే తాము బుల్డోజర్లతో వస్తామని హెచ్చరించారు. మరో రెండు రోజుల్లో జరగబోయే జిల్లాస్థాయి సమావేశానికి టీడీపీ శ్రేణులంతా సమాయత్తం కావాలని పరిటాలశ్రీరామ్ పిలుపు నిచ్చారు. సీఎం సభ కోసం రాయలసీమను స్తంభింపజేశారని విమర్శించారు. సిద్ధంసభలో మీడియా ఫోటోగ్రాఫర్ కృష్ణపై దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

టిడిపిలో పలువురు చేరిక : మాజీ మున్సిపల్ చైర్మన్ బీరేగోపాలక్రిష్ణ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన చేనేత ప్రముఖులు టిడిపిలో చేరారు. బీరే ప్రసాద్, బీరే చంద్రశేఖర్, దాసరిమురళీ, దాసరి సంజీవులు,దాసరి నారాయణస్వామి,దాసరి మారుతి, పల్లెంకష్ణ, గిర్రాజు బొజ్జీ, మాజీ ఎంపీటీసీ బాలాజీనాయక్, సుబహాన్, సిద్దిక్లతోపాటు మొత్తం 100 కుటుంబాలు పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికి పరిటాల శ్రీరామ్ పార్టీకండువాలు వేసి సాదారంగా ఆహ్వానించారు.

రెడ్డి జెఎసి ఆధ్వర్యంలో ప్రతిభా విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల విడుదలైన జెఈఈ మెయిన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి 99.58 శాతం ఉత్తీర్ణత సాధించిన గగన్ శ్యామ్ రెడ్డిని ఎపి రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో పూలకుంట సమీపంలో ఉన్నా సువర్ణ భారతీ జూనియర్ కళాశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షులు సడ్లపల్లి వెంకటేష్ రెడ్డి ఇలాంటి విజయాలు ఎన్నో సాధించాలని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సువర్ణ భారతి విద్యా సంస్థల అధినేత బి నీలకంఠ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు లేపాక్షి అంజన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, నియోజవర్గ కార్యనిర్వాహక అధ్యక్షులు నరసింహారెడ్డి, మండల అధ్యక్షులు సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, మంజునాథ్ రెడ్డి, గజేంద్ర రెడ్డితో పాటు రెడ్డి సోదరులు పాల్గొన్నారు.

గగన్ శ్యామ్ రెడ్డి ని సన్మానిస్తున్న రెడ్డి జేఏసీ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

యుద్ధానికి సిద్ధం : పల్లె

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్ర యుద్ధానికి సిద్ధం కావాలని టిడిపి శ్రేణులకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పల్లె మాట్లాడుతూ ఈ ఐదేళ్ల వైసిపి పాలనలో అరాచకాలు దౌర్జన్యాలు దోపిడీలు అధికమయ్యాయని అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కోరారు. సార్వత్రిక ఎన్నికలు ఎంతో కీలకమని చెప్పారు. దొంగ ఓట్లతో గెలవాలని వైసీపీ శ్రేణులు ఏదో విధంగా తప్పుడు మార్గాలు అవలంబిస్తారని వాటిని బలంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పదవ తరగతి ఫలితాలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని పాంచజన్య శ్రీనివాసులు అన్నారు. సోమవారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలని, ఆ లక్ష్య సాధన కోసం పట్టుదలతో శ్రమిస్తే తప్పకుండా విజయం విద్యార్థుల వెంటనే ఉంటుందన్నారు. ఉన్నత చదువుల నుంచి ఉన్నత ఉద్యోగాల వరకు పదవ తరగతిలో సాధించిన మార్కులే ప్రామాణికంగా తీసుకుంటున్నారన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించి, తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ డిఎస్ నందకుమార్, హెచ్ఎం గాయిత్రి, సూపరిటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు శశికళ, షేక్ అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్, ఉపాధ్యాయులు ముత్యాలప్ప, ఫ్రాన్సినా, కీర్తిప్రియ, భారతి, మంజులతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న పాంచజన్య శ్రీనివాసులు

జర్నలిస్టుపై దాడి హేయం

ప్రజాశక్తి యంత్రాంగం

అనంతపురం ఫోటో జర్నలిస్ట్ శ్రీకష్ణపై దాడిని సత్యసాయి జిల్లాలోని పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టులు ఖండించారు. సిద్ధం బహిరంగ సభలో ఫోటోలు తీస్తున్న ఫొటో జర్నలిస్టుపై వైసీపీకి చెందిన అల్లరి మూకలు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది పిరికిపంద చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల సభలు సమావేశాలు బహిరంగ సభలలో ఫోటోలో తీయడం వారి వృత్తి అని దానిని వృత్తిగానే చూడాలని రాజకీయ కోణంలో చూడడం సరికాదని అన్నారు. దాడిని పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పుట్టపర్తి, నంబుల పూలకుంట, కదిరి, కదిరి, ఓబుళదేవరచెరువు, కొత్తచెరువు, ధర్మవరం, చిలమత్తూరు, బత్తలపల్లి, ముదిగుబ్బ, నల్లమాడ , హిందూపురం తదితర మండలాల్లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. టిడిపి, జనసేన, బిజెపి, సిపిఎం, సిపిఐ, ఎంఆర్‌పిఎస్ తదితర ప్రజాసంఘాల నాయకులతో పాటు, ఆయా మండలాల్లో పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుపై దాడిని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఓ ప్రకటనలో ఖండించారు.

కదిరిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరంలో నిరసన

హిందూపురంలో ఆందోళన

కర్నాటకలో రోడ్డు ప్రమాదం

చిలమత్తూరు మహిళ మృతి

చిలమత్తూరు : మండలంలోని పాతచామలపల్లికి చెందిన వెన్నెల(35) అనే వివాహిత కర్నాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందింది. కర్నాటకలోని 44 వ నెంబరు జాతీయ రహదారి బాగేపల్లి వద్ద సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నెల మృతిచెందింది. సోమవారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో పాతచామలపల్లి నుండి బెంగళూరుకు వెళుతున్న టాటా సఫారీ వాహనం గ్రీన్ పార్క్ డాబా వద్ద హైవేకు వెళ్లే మలుపు లో వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో టాటా సఫారీలో ఉన్న వెన్నెల(35) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె కుమార్తె ఐదేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు అంబులెన్స్ సహాయంతో హుటాహుటిన బెంగళూరుకు తరలించారు. కాగా టాటా సఫారీలో ప్రయాణిస్తోన్న మరో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పెళ్లికి అని గ్రామానికి వచ్చి బెంగళూరుకు తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

యువకుడు ఆత్మహత్య

నల్లమాడ : మండలంలోని చౌటకుంటపల్లి వద్ద గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నల్లమాడ పోలీసులు తెలిపారు మృతునికి దాదాపు 35 సంవత్సరం వయసు ఉంటుందని నలుపు గీతల చొక్కా, నల్ల ప్యాంటు ధరించారని చెప్పారు. ఎర్రటి చున్నితో మామిడి చెట్టుకు ఉరివేసుకున్నాడని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు నల్లమాడ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ రమేష్‌బాబు కోరారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని గేట్ కొట్టాల కాలనీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు అయ్యాయి. ఈ రోడ్డులో భవన నిర్మాణ కోసం మూడు నెలల క్రితం భారీ గుంత తవ్వారు. ఈ నేపథ్యంలో రెండు ద్విచక్ర వాహనాలలో వెళుతున్న నలుగురు యువకులు ఎదురు ఎదురుగా వచ్చే సమయంలో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గుంతలో పడిన వారికి గాయాలు అయ్యాయి.

కర్నాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు : మండలంలోని 44 వ నెంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టు వద్ద సెబ్ పోలీసులు సోమవారం నిర్వహించిన సాధారణ తనిఖీల్లో కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. పులివెందుల వైపునకు వెళుతోన్న ఏపీఎస్ఆర్టీసీ బస్సులో తలుపుల మండలానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుండి 46 కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ శ్రీరాములు తెలిపారు.

రేణుక హాస్పిటల్ ప్రారంభం

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డులో డాక్టర్ అశోక్ రెడ్డి డాక్టర్ రేణుక ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రిని సోమవారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దా రెడ్డి సతీమణి డాక్టర్ ఉషారాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో హాస్పిటల్ ప్రారంభించడం హర్షనీయమన్నారు. ప్రాణాపాయ స్థితిలో వచ్చిన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో గదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కరాటే పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ధర్మవరం విద్యార్థులు సత్తాచాటినట్లు మల్టీస్టార్ ఆలిండియా బుడోఖాన్ కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా తెలిపారు. సత్యసాయిజిల్లా తరపున కటా, కుమితే విభాగంలో ఇర్షాద్ సిల్వర్ మెడల్, అబుబకర్ కటా విభాగంలో సిల్వర్మెడల్ కుమితే విభాగం లో బ్రాంచ్ మెడల్, ఎస్.ప్రణవ్ కటా విభాగంలో గోల్డ్‌మెడల్, కుమ్మితేవిభాగంలో సిల్వర్, శర్విన‌రెడ్డి కటా విభాగంలో గోల్డ్‌మెడల్, కుమితేవిభాగంలో సిల్వర్ మెడల్, అనిఫ్ కటావిభాగంలో సిల్వర్‌మెడల్, కుమ్మితేవిభాగంలో బ్రాంచ్‌మెడల్ దక్కించుకున్నారన్నారు. అదే విధంగా సాలు ఈశ్వర్ కటాలో బ్రాంచ్‌మెడల్, మహమ్మద్ ఆజాం కటా విభాగంలో సిల్వర్ మెడల్, కమ్మితే విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించారన్నారు. వీరికి సినీ హీరో సుమన్ మెడల్స్ తోపాటు ప్రసంశాపత్రాలను అందజేసినట్లు చెప్పారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక

ధర్మవరం టౌన్ : బెలగావిలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో ఈ నెల 20వతేదీ నుంచి 26వ తేదీ వరకు కర్నాటక ప్రభుత్వం యువజన, కీడలశాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి ధర్మవరం కెహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో తతీయ సంవత్సరం చదువుతున్న సాకేసాయికుమార్, చింతానందినికి సోమవారం కళాశాలలో ఎంపిక పత్రాలను అందజేశామన్నారు. జాతీయ సమైక్యత శిబిరంలో ఉన్నత లక్ష్యాలను పెంచుకోవడం, ఉన్నత ఆలోచనలు అనుసరించడం, మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ఇతర రాష్ట్రాల విద్యార్థుల ముందు ప్రదర్శించే అవకాశం మన విద్యార్థులకు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి గోపాలనాయక్, వైస్ ప్రిన్సిపల్ త్రివేణి, అధ్యాపకులు షమీవుల్లా, చిట్టెమ్మ, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్పవతి, సౌజన్య,సరస్వతి, హేమావతి పాల్గొన్నారు.

ఇంటింటా సూక్ష్మ ప్రణాళిక సర్వే

హిందూపురం : బాలయేసు డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా యూనిట్ 1 ఆధ్వర్యంలో పరిగి మండలం కోనాపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటా సూక్ష్మ ప్రణాళికా సర్వేను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు శివరామ రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.